- ముగిసిన తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు
- సర్పంచుకు 521, వార్డు స్థానాలకు 1,426 మంది బరిలో
- రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- పల్లెల్లో వేడెక్కిన రాజకీయం



వాంకిడి నామినేషన్ కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు(ఫైల్)

వారంలోనే అంతా.. అభ్యర్థుల చింత

ఆసిఫాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఇచ్చిన షెడ్యూల్ లో అభ్యర్థుల తుది జాబితా అనంతరం ప్రచారానికి వారం రోజుల గడువు మాత్రమే మిగులుతోంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాకనే పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారం నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ మేరకు మూడు విడతల్లోనూ ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. పంచాయతీ ఎన్నికలకు తొలి విడతకు సంబంధించిన నామినేషన్ల గడువు శనివారం ముగిసింది. నామినేషన్లు వేసిన అభ్యర్థులు, వారికి మద్దతు ఇస్తున్న పార్టీల నాయకులు తమకు ఒక్క చాన్స్ ఇవ్వాలంటూ ప్రచారం ప్రారంభించారు. దీంతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. తొలి విడతలో 114 గ్రామపంచాయతీలు, 944 వార్డుల్లో నామినే షన్లను స్వీకరించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు రాత్రి వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు క్యూలు కట్టారు. సర్పంచ్ స్థానాలకు మొత్తం 521, వార్డు స్థానాలకు 1,426 నామినేషన్లు వచ్చాయి. ఆదివారం నామినేషన్ల పరిశీలన చెల్లుబాటు అయిన నామినే షన్ల వివరాలను అధికారులు వెల్లడించారు. సోమవారం అప్పీళ్ల స్వీకరణ, మంగళవారం అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటిస్తారు. డిసెంబరు 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతరం విజేతలను ప్రకటించడం జరుగుతుంది.

ఐదు మండలాల్లో..

తొలి విడతలో జిల్లాలోని ఐదు మండలాల్లోని 114 సర్పంచ్ స్థానాలు, 944 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ శనివారం రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. అధిక సంఖ్యలో అభ్యర్థులు ఉండడంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఆలస్యమైంది. సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ల గడువు ముగిసిన ఆ సమయానికి క్యూలో ఉన్న అభ్యర్థులకు టోకేన్లు జారీ చేసి నామినేషన్ల దాఖలుకు అనుమతి ఇచ్చారు. దీంతో జిల్లాలో సర్పంచ్ స్థానాలకు మొత్తం 521, వార్డు స్థానాలకు 1426 నామినేషన్లు వచ్చాయి.

ప్రచారానికి వ్యూహరచన..

పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు పంచాయతీ అభ్యర్థులు వ్యూహరచన జరుపుతున్నారు. ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తి కావడం నామినేషన్ల ఉపసంహరణ, గుర్తులు కేటాయించడం వంటి పనులు మిగిలి ఉండడం, ప్రచారానికి కొద్ది రోజులు గడువు ఉండటంతో అభ్యర్థులు ప్రధానంగా ప్రచారం వైపు దృష్టి సారిస్తున్నారు. అభ్యర్థులు ఏర్పాటు చేసుకోవాల్సిన ప్రచార సామాగ్రిని గ్రామస్థాయి నాయకులకు నియోజకవర్గస్థాయి నేతలు వివరిస్తున్నారు. ఓటర్లను అకర్షించడానికి పలు విషయాలను వివరి స్తూ ఇప్పటి వరకు తమ పార్టీ ప్రజాప్రతినిధులు జరిపిన అభివృద్దిని గుర్తు చేయడానికి పార్టీలు సన్నద్ధం అవుతున్నాయి. పోలింగ్ బూత్‌ల వారీగా ఏజేంట్లను నియామకం చేసి ప్రచారాన్ని పర్యవేక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకుం టున్నారు. తమతమ వర్గానికి అనుకూలంగా ఉండే గ్రామనికి చెందిన ముఖ్య నాయకులను కార్యకర్తలను బూత్‌ల వారీగా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండో విడతలో 113..

జిల్లాలో రెండో విడత సర్పంచ్, వార్డు స్థానాలకు ఆదివారం నుంచి నామినేషన్లను స్వీకరణ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ డిసెంబరు 2 వరకు కొనసాగనుంది. బెజ్జూరు మండలంలోని 22 పంచాయతీలు, 188 వార్డు స్థానాలు, దహెగాం మండలంలోని 24 పంచాయతీలు, 200 వార్డు స్థానాలు, చింతలమానేపల్లిలోని 19 పంచాయతీలు, 176 వార్డు స్థానాలు, కౌటాల మండలంలోని 20 పంచాయతీలు, 182 వార్డు స్థానాలు, పెంచికల్‌పేట మండలంలోని 12 పంచాయతీలు, 102 వార్డు స్థానాలు, సిర్పూర్(టి) మండలంలోని 16 పంచాయతీలు 144 వార్డు స్థానాలు ఉండగా మొత్తం 113 గ్రామపంచాయతీలు, 992 వార్డు స్థానాలకు నామినేషన్లను స్వీకరించనున్నారు. డిసెం బరు 2 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 3న నామినేషన్లను పరిశీలించి 6న ఉపసంహరణకు గడువు విధించారు. డిసెంబరు 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా మండలాల పరిధిలోని సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

జిల్లాలో మూడు చెక్ పోస్ట్‌ల ఏర్పాటు

ఆసిఫాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో అక్రమ రవాణా, నగదు పంపిణీ, మద్యం సరఫరాను అరికట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఎస్పీ నితికా పంత్ అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అక్రమ చర్యలను అరికట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో మూడు చెక్ పోస్టులు వాంకిడి, వెంకట్రావుపేట, దుబ్బగూడలలో ఏర్పాటు చేశామన్నారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటలు పోలీసు సిబ్బంది డ్యూటీలో ఉంటూ వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించే ప్రయత్నాలకు ముందుగానే నిరోధించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారన్నారు. ఆదివారం నుంచి జిల్లాలో రెండో దఫా నామినేషన్ ప్రక్రియ బెజ్జూరు, చింతలమానేపల్లి, దహెగాం, కౌటాల, పెంచికలపేట, సిర్పూర్(టి) మండలాల పరిధిలో ప్రారంభమైన నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారని తెలిపారు.. నామినేషన్ సెంటర్లు, పోలింగ్ కేంద్రాల పరిశీలన ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిరంతరం అనుమానస్పద వాహనాల తనిఖీ, నాకబంది కొనసాగి స్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి గస్తీలు, ఆకస్మిక చెకింగ్, నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనులపై తక్షణ చర్యలకు వెనకాడబోమని తెలిపారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆసిఫాబాద్‌లోని పెన్షనర్ భవన్‌లో ఆదివారం నిర్వహిచిన జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని మండలాల్లో సభ్యత్వాన్ని పూర్తి చేసినందుకు అభినందించారు. అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని యజమాన్యాలను భాగస్వాములుగా చేయాలని చెప్పారు. అప్పుడే మన బలమైన ఐక్య కార్యాచరణ ప్రణాళిక అమలు జయ ప్రదం కావడానికి అవకాశం ఉందని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియర్ టీచర్‌కు టెట్ వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు ఇందురావు, ఊశన్న, రమేష్, రాజకమలాకర్‌రెడ్డి, హేమంత్‌సిండే, సుభాష్, రవికుమార్, మహేష్, సచిన్, పృధ్వీ, రాజలింగు, బాదిరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు డిపాజిట్ ఎందుకు..

వాంకిడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీతో సహా ఇతర ఎన్నికల ఏ ఎన్నికలైనా నామినేషన్ వేసే అభ్యర్థి దరఖాస్తుతో పాటు డిపాజిట్ రూపంలో కొంత నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో అస్తవ్యస్తంగా అధికమంది పోటీ చేసేందుకు రాకుండా చిత్తశుద్ధి ఉన్న నిజమైన అభ్యర్థులే ఉండాలనే ఉద్దేశంతో డిపాజిట్ నిబంధనను ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ లేదా నామినేషన్ ఫీజును సాదారణ భాషలో డిపాజిట్ అని పిలుస్తారు. సర్పంచు స్థానానికిపోటీ చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులైతే రూ. 1000, జనరల్ అభ్యర్థి అయితే రూ. 2000 చిల్లించాల్సి ఉంటుంది. వార్డు సభ్యుని స్థానానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ. 250, జనరల్ అభ్యర్థులు రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ దక్కితేనే పోటీ చేసి పరువు నిలబెట్టుకున్నట్లుగా భావిస్తారు. ఈ కారణంగానే అసలైన అభ్యర్థులే ఎన్నికల్లో పోటీకి నిల్చునేందుకు ముందుకు వస్తుంటారు.

తిరిగి పొందాలంటే..

నామినేషన్ వేసిన అభ్యర్థి చెల్లించిన డిపాజిట్ డబ్బులను సదరు నామినేషన్ తిరస్కరణకు గురైనా, ఉపసంహరించుకున్న సందర్భంలో తిరిగి ఇస్తారు. నామినేషన్ పరిగణలోకి తీసుకొని ఎన్నికలు నిర్వహిస్తే ఆయన పోటీ చేసిన స్థానంలో పోలైన ఓట్లలో చెల్లుబాలు అయ్యే వాటిలో ఆరోవంతు (16.67 శాతం) ఓట్లు అభ్యర్థికి వస్తే ఆ అభ్యర్థికి డిపాజిట్ తిరిగి ఇస్తారు. ఉదహారణకు ఒక గ్రామంలో చెల్లుబాటు అయ్యే ఓట్లు 600 ఉంటే అభ్యర్థికి అందులో ఆరో వంతు అనగా 100 ఓట్లు రావాల్సి ఉంటుంది. అభ్యర్థి గెలుపుఓటములతో సంబంధం లేకుండా ఆరోవంతు ఓట్లు వస్తే డిపాజిట్ డబ్బులు తిరిగి ఇస్తారు. లేకుంటే డిపాజిట్ కోల్పోతారు.

రెండో విడతకు నామినేషన్లు

ఆసిఫాబాద్/సిర్పూర్(టి)/బెజ్జూరు/దహెగాం/చింతలమానేపల్లి(కౌటాల)/కౌటాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట మండలాల్లోని 113 సర్పంచ్ స్థానాలకు, 992 వార్డు స్థానాలకు అధికారులు నామినేషన్లను స్వీకరించారు. మొదటి రోజు ఆయా మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 29, వార్డు స్థానాలకు 35 నామినేషన్లు దాఖలు అయ్యాయి. సిర్పూర్(టి) మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు రెండో విడత జరుగున్న ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభం అయింది. మొదటి రోజు మండల వ్యాప్తంగా సర్పంచ్ స్థానాలకు 2, వార్డు సభ్యులకు 1 నామినేషన్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలోని చీలపల్లిలో సర్పంచ్ స్థానానికి 1, వెంపల్లిలో సర్పంచ స్థానానికి 1, సిర్పూర్(టి) వార్డు స్థానానిక 1 నామినేషన్ వచ్చినట్లు తెలిపారు. కాగా నామినేషన కేంద్రాన్ని జడ్పీ సీఈఓ లక్ష్మినారాయణ ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ వినోద్, ఈఓ తిరుపతి తదితరులు ఉన్నారు. బెజ్జూరు మండలంలో సర్పంచ స్థానాలకు 5, వార్డు సభ్యుల స్థానాలకు 12 నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు, 188 వార్డు స్థానాలు ఉండగా సర్పంచ్ స్థానాలకు 5, వార్డు సభ్యుల స్థానాలకు 12 నామినేషన్‌లు వచ్చినట్లు తెలిపారు. దహెగాం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు 19 నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. సర్పంచ్ స్థానాలకు 9, వార్డు సభ్యుల స్థానాలకు 10 వచ్చినట్లు తెలిపారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 200 వార్డు సభ్యులు ఉన్నాయి. కౌటాల మండలంలో రెండో విడతలో మొదటి రోజు సర్పంచ్ స్థానానికి 6, వార్డు స్థానాలకు 6 దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. గుడ్లబోరి, గుండాయిపేట, ముత్యంపేట, శిర్సా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు ఒకటి చొప్పున, తలోడిలో సర్పంచ్ స్థానానికి 2 నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. అలాగే వార్డు సాథనాలకు కౌటాలలో 2, ముత్యంపేటలో 3, తలోడిలో 1 నామినేషన దాఖలు అయ్యాంయి. చింతలమానేపల్లి మండలంలో సర్పంచ్ స్థానానికి రెండు, వార్డు స్థానాలకు 2 నామినేషన్లు దాఖలు అయ్యాయి. గంగాపూర్ సర్పంచ్ స్థానానికి 1, కర్జెల్లి సర్పంచ్ స్థానానికి 1బాలాజీ అనుకోడలో 1, రవీంద్రనగర్-1లో 1 నామినేషన్ దాఖలు అయ్యాయి.


సిర్పూర్(టి)లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

'శ్యాంనాయక్‌ను గ్రామాల్లో తిరగనివ్వం'

తిర్యాణి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీని కాపాడే నాయకులకు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న శ్యాంనాయక్‌ను గ్రామాల్లో తిరగవ్వమని ఆదివాసీ నాయకుడు కోట్నాక గణపతి అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్యాంనాయక్‌ను ప్రజలు తిరస్కరించారని చెప్పారు. అది మరిచి పోయిన మాజీ డీసీసీ అధయక్షుడు విశ్వప్రసాద్‌రావు, పార్టీ సీనియర నాయకుడు అనిల్‌గౌడ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులను గెలిపించుకోవాల్సింది పోయి సొంత పార్టీ నాయకులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇలాంటి చర్యలను ఖండస్తున్నామని తెలిపారు. సొంత పార్టీలో ఇలాంటి వ్యవహారాలు సరికాదని చెప్పారు. వీటిని వెంటనే మానుకోవాలని ఈ సందర్భగా కోరారు. పార్టీని బలహీన పరిచేలా వ్యవహారం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో వినోద్, వెంకటేశంగౌడ్, కుమార్, శంకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

కాగజ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈసుగాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం సట్టిబోనాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరి కోత వచ్చిన తర్వాత కొత్త బియ్యంతో అన్నం వండి నైవేద్యం చేసి పూజలు చేశారు. అనంతరం శివాలయంలో భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తులు పోటెత్తి రావటంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నీ ఏర్పాట్లు చేశారు. మల్లన్న స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కార్యక్రమంలో సిర్పూరు నియోజకవర్గంలోని భక్తులు పాల్గొన్నారు.

మూడు చోట్ల ఒకే నామినేషన్

వాంకిడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు గ్రామ పంచాయ తీల్లో సర్పంచ్ స్థానానికి ఒక్కటే నామినేషన్ దాఖలైంది. మండలంలోని ధాబా, లెండిగూడ, నవేగూడ గ్రామ పంచాయతీల్లో కేవలం ఒక్కొక్క నామినేషన్ లు మాత్రమే దాఖలైనాయి. దీంతో ఈ పంచాయతీల్లో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. నామినేషన్ల స్వీకరణ చివరిరోజున వాంకిడి మండలంలో భారీగా నామినేషన్లు దాఖలైనాయి. మండలంలోని నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద సర్పంచు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు బారులు తీరారు. నామినేషన్ల కోసం అభ్యర్థులు భారీగా కేంద్రాలకు తరలిరావడంతో 5 గంటల లోపు కేంద్రాల వద్దకు వచ్చిన అభ్యర్థులకు టోకేన్లు ఇచ్చి రాత్రి 10 గంటల వరకు నామినేషన్లను అధికారులు స్వీకరించారు. 28 గ్రామపంచాయతీలకు గాను సర్పంచు స్థానాలకు 106 నామినేషన్లు, 236 వార్డు స్థానాలకు గాను 407 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో జోత్న్స తెలిపారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలో మొదటి విడుతలో జరిగే సర్పంచ్ ఎన్నికల కోసం ఈ నెల 11న జరిగే తొలి విడత ఎన్నికల కోసం గత మూడు రోజుగా జరిగిన నామినేషన్ ప్రక్రియలో శనివారం చివరి రోజు కావడంతో నామినేషన్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు సాగింది. సాయంత్రం 5 గంటల తరువాత టోకెన్ సిస్టంట్ ఏర్పాటు చేసిన అధికారులు నామినేషన్‌లు స్వీకరించారు. కాగా 31 సర్పంచ్ స్థానాలకు 156 నామినేషనుల రాగా, వార్డు సభ్యుల స్థానాలకు 383 నామినేషన్‌లు వచ్చినట్లు ఎంపీడీఓ సురేష్‌కుమార్ తెలిపారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి


బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీపీకి పార్టీ కండువా వేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. . పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం బీజేపీకి చెందిన సిర్పూరు(టి) మాజీ ఎంపీపీ మాలతీ బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిరుపేదలను నట్టేట ముంచాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇంత వరకు అమలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ గతంలో చేపట్టిన పథకాలే నిరుపేదలకు వరంగా మిగిలినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే ఈసుగాంలో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న వైన్ షాపును వెంటనే తొలగించాలన్నారు. ఈ విషయంలో పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ కూడా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జైనూరు మండలం అందుగూడ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు ఆదివారం ఆసిఫాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, రమేష్, బాబురావు, మంగేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో పటిష్ట నిఘా

- పట్టణంలో వందకు పైగా సీసీ కెమెరాల ఏర్పాటు
- నేరాల ఛేదన, నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరుగుతున్న చోరీ, తదితర కేసుల్లో పురోగతి కోసం కాగజ్‌నగర్‌లో సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేయిస్తున్నారు. గతంలో ఉన్న కెమెరాలతో పాటు ప్రస్తుతం 97 కెమెరాలు అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పలు కేసుల్లో ఇబ్బందులు ఉండకుండా సత్వరమే కేసులోని విషయాలు బహిర్గతం కావడం, తద్వారా నిందితులను కనిపెట్టేందుకు దోహదపడతాయి. పట్టణంలోని పలు చోట్ల ఇప్పటికే ఆధునాతన సీసీ కెమెరాలు బిగించారు. మరి కొన్ని కాలనీలు, రోడ్లపైనీ సీసీ కెమెరాలు బిగించడం కొనసాగుతోంది. గతంలో ఉన్న 100కు పైగా కెమెరాల్లో కొన్ని చోట్ల చెడిపోయాయి. దీంతో పలు కేసుల్లో ఇబ్బందులు తలెత్తాయి. కాగజ్‌నగర్ డిఎస్పీ వహీదుద్దీన్, టౌన్ ఎస్‌హెచ్‌వో ప్రేవ్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు జరుగుతోంది.

పలు కాలనీల్లో..

కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియా, అంబేద్కర్ చౌక్, రాజీవ్ చౌరస్తా, సర్‌సిల్క్ ఏరియా, లారీ చౌక్, విజయ బస్తీ, ఓల్డ్ కాలనీ, ఫాతిమా కాన్వెంట్ పాఠశాల, రైల్వే ఓవర్ బ్రిడ్జి, రామ్ మందిర్ తదితర ప్రాంతాలతో పాటు, బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ ఏరియాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే త్రిశూల్ పహాడ్‌పై గల ఎత్తైన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద సోలార్ విద్యుత్‌తో సి.సి కెమెరాలతో పాటు 100కు పైగా కెమెరాలను బిగించారు. బాలాజీ నగర్, ఎస్పీఎం కాలనీలతో పాటు పలు చోట్ల సీసీ కెమెరాలు గతంలో మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పలు సంఘటనలు జరగుతుండడంతో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకొని అధునాతన కెమెరాలు ఏర్పాటు చేసేందుకు దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా కాలనీలు, కూడళ్లతో పాటు సమస్యాత్మకంగా ఉండే ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక నిఘా వేసి నిందితులను పట్టుకునేందుకు పలు కేసుల్లో లోతుగా దర్యాప్తు చేసేందుకు సీసీ కెమెరాల ఆవశ్యకత ఉండడంతో పాటు ఎస్పీఎంకాలనీల్లో యాజమాన్యం పర్యవేక్షణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుగా వచ్చారు. కాగా గతంలో సీసీ కెమెరాల పర్యవేక్షణకు సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం టౌన్ సీఐ ప్రేంకుమార్ ప్రత్యేక శ్రద్ధతో వీటిని పర్యవేక్షించేందుకు కానిస్టేబుళ్లను ప్రత్యేకంగా కేటాయించారు. ఈ సిబ్బంది నిత్యం సీసీ కెమెరాల పని తీరుపై దృష్టి సారిస్తారు. నిత్యం పెరుగుతున్న ఆర్థిక సంబంధ నేరాలతో పాటు ప్రమాదాలు నివారించేందుకు, నిందితులను సులువుగా పట్టుకునేందు పోలీసు శాఖ నిఘా పెంచుతోంది. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, రోడ్లతో పాటు రైల్వే ఫ్లైఓవర్‌పై తరచూ ప్రమాదాలు జరుగతుండడంతో వాటిపై దృష్టి సారించి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.


కాగజ్‌నగర్‌లో ఫ్లైఓవర్‌పై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ప్రజలు సహకరించాలి

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి. ప్రతి ఒక్కరూ తమ వ్యాపార సముదాయాల ఎదుట, ఇళ్లల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. నేరాల నియంత్రణ, పరిశోధనకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి. చోరీలు ఇతర సంఘటనలు జరిగినప్పుడు సీసీ ఫుటేజీ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలే కీలకంగా మారుతాయి. ప్రతీ చోట కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసు శాఖకు ప్రజలు సహకరిస్తే నేరాలను నియంత్రించే అవకాశం ఉంటుంది.

- ప్రేమ్‌కుమార్, కాగజ్‌నగర్ పట్టణ సీఐ

అయ్యప్పలకు ముస్లిం వ్యక్తి భిక్ష

కౌటాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని ఎస్బీఐ మేనేజర్‌గా పని చేస్తున్న షేక్ చాన్ భాషా ఆదివారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భిక్ష ఏర్పాటు చేసిన షేక్ చాన్ భాషాను పలువురు అభినందించారు.

అభ్యర్థుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి



బెజ్జూరులో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, పాల్గొన్న అధికారులు

బెజ్జూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచులు, వార్డు సభ్యుల వివరాలను టీ పోల్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆదివారం మండలంలోని నలుగుపల్లి నామినేషన్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో నామినేషన్ వేసిన అభ్యర్థుల దరఖాస్తులను ఫాం-2ఎ, 2బి రిపోర్టులను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, కోడ పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్వో తిరుపతి, ఏఆర్వో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏరాపటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆదవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. పోలీసు అధికారులు భద్రత ఏర్పాటు చూడాలని, నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో వాహనాలు ఉండే విధంగా చూడాలని చెప్పారు. నామినేషన్ కేంద్రంకు ముగ్గురు అభ్యర్థులను మాత్రమే అనుమతించాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. నామినేషన్లు వేసే సమయంలో తప్పులు దొర్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.వారి వెంట ఎంపీడీవో ఆల్బర్ట్, తహసీల్దార్ తిరుపతి, ఆర్ఐ అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్‌ల, వార్డు సభ్యుల నామినేషన్ పత్రాల వివరానలు కంప్యూటర్‌లో నమోదు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. దహెగాం మండల కేంద్రంలోని రైతు వేదిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నామినేషన్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకుఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. పోలీసు అధికారులు భద్రత ఏర్పాట్లు పకడ్బం దీగా చేపట్టాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ సూచనలు తప్పకుండా పాటించాలని చెప్పారు. నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. అకాఆరులు తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో శ్రీనివాస్, ఎంఆర్ఐ నాగభూషణం, తదితరులు ఉన్నారు.

సామాజిక ఆసుపత్రికి మహర్దశ

- వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు ప్రభుత్వం అనుమతి
- రూ. 26 కోట్ల నిధులు విడుదల చేసిన సర్కార్



కాగజ్‌నగర్ సామాజిక ఆసుపత్రి

కాగజ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సామాజిక ఆసుపత్రి ఇక వంద పడకల ఆసుపత్రిగా మారనుంది. ప్రస్తుతం 30 పడకలతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. పది రోజుల క్రితం ఇందుకు సంబంధించి జీవోను కూడా విడుదల చేశారు. అలాగే రూ.26 కోట్ల నిధులను కూడా విడుదల చేసింది. ప్రధానంగా సివిల్ పనుల కోసం రూ.18 కోట్లు, మిగిలిన నిధులతో పరికరాల కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు ఆసుపత్రి ఆవరణలో ఉన్న పురాతన భవనాన్ని కూల్చివేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆసుపత్రి నిర్మాణం కోసం..

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం పలు చోట్ల స్థలం ఎంపిక చేసినప్పటికీ సరైన వసతులు లేమితో మళ్లీ సామాజిక ఆసుపత్రి భవనంలోనే మార్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిధులతో జీ+2 భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి కొనసాగుతున్నది. ఈ భవనం నిర్మాణం పూర్తి అయితే వంద పడకల ఆసుపత్రిగా సేవలు అందించేందుకు శ్రీకారం చుడుతున్నారు. సిర్పూరు నియోజకవర్గంలోనే ఏడు మండలాలకు కీలక సేవలను అందిస్తోంది. ఈ ఆసుపత్రిలో గర్భిణులకు ప్రసవం, స్కానింగ్, నిత్యం రోగులకు వైద్యం అందిస్తున్నారు. వంద పడకలు అప్‌గ్రేడ్ అయితే గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, ఎనస్తీయా, ఈఎన్‌టీ సర్జన్, ఎంబీబీఎస్ డాక్టర్ల పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. కాగజ్‌నగర్ 30 వార్డులతో పాటు సమీప మండలాల ప్రజలు ఇక్కడే వైద్యం తీసుకుంటున్నారు. రోజు రోజుకు రోగుల సంఖ్య క్రమేణా పెరుగుతుండడంతో వైద్య సేవలు మరింత ఆధునీకరణ పరికరాలతో సేవలు అందించనున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో మలేరియా, సీబీపీ, వైడల్ టెస్టులు చేస్తున్నారు. మిగితా టెస్టులు జిల్లా కేంద్రానికి పంపిస్తున్నారు. వంద పడకలు ఆసుపత్రి నిర్మాణం జరిగితే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానుండడంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు త్వరితగిన పూర్తి చేస్తే ఈ ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. అధికారులు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులోకి వైద్యం..



ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వంద పడకల ఆసుపత్రికి నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లాం. రూ.26 కోట్ల నిధులు విడుదల కావడం హర్షణీయం. పనులు పూర్తి జరిగితే వైద్య సౌకర్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తి జరిగితే గైనకాలిజస్ట్, అనస్తషియా, ఈఎన్‌టీ, ఎంబీబీఎస్ వైద్యులతో సేవలు అందనున్నాయి.

- హరీష్‌బాబు, సిర్పూరు ఎమ్మెల్యే

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం

భీమిని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భీమిని నుంచి టేకులపల్లికి ఆటో (టీఎస్ 19 టీ 6601)లో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఆదివారం పట్టుకున్నట్టు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా తమను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా బైక్‌తో చేజ్ చేసి పట్టుకున్నామన్నారు. కొమ్ము రాజు, మానెపల్లి వంశీలను అదుపులోకి తీసుకొని ఆటోతో పాటు అందులోని రూ. 40 వేల విలువగ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకునట్టు చెప్పారు. అక్రమంగా మద్యం తరలిస్తే, ఇళ్లల్లో నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి



భరత్‌రెడ్డి(ఫైల్)

జైపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కంటి గ్రామానికి చెందిన బేతు భరత్‌రెడ్డి (14) అనే విద్యార్థి హైద్రాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భరత్‌రెడ్డి వరంగల్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు ఎల్కంటిలోని ఇంటికి తీసుకువచ్చారు. ఆదివారం భరత్ అస్వస్థతకు గురికావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు హైద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తండ్రి బేతు తిరుపతిరెడ్డి రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షునిగా, కాంగ్రెస్ సీనియర్ నాయకునిగా పనిచేస్తున్నాడు. కుమారుడు మృతిచెందడంతో ఆయన రోధిస్తున్న తీరు అందర్ని కంటతడిపెట్టించింది. ఆయనకు కూతురు, కుమారుడు ఉండగా కుమారుడు మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

కార్మిక కాలనీలపై చిన్న చూపు

రాకమృష్ణాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి కార్మిక కాలనీల్లో సమస్యలు పేరుకపోయాయని సీఐటీయూ బ్రాంచి సెక్రటరీ ఎస్. వెంకటస్వామి, రామగిరి రామస్వామి అన్నారు. స్థానికంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ క్యాతన్‌పల్లి మున్సిపాలిటి కమిషనర్‌కు సమస్యలు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్మికకాలనీల్లో గత కొన్ని రోజులుగా నీటి సరఫరా సరిగ్గా చేయడం లేదని తెలిపారు. నీటి సరిఫరాలో ఏమైన లోపాలుంటే సరిదిద్దాల్సిన మున్సిపల్ అధికా రులపై ఉందన్నారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేతి పంపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై త్వరలోనే మున్సిపల్ కమిషనర్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. యాజమా న్యం అభివద్ధికి కృషి చేయాలని కోరుతామన్నారు. మందమర్రిలోని కార్మిక కాలనీలో భవిష్యత్‌లో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడోవార్డు చెత్లాపూర్‌లో సంప్‌లు ఏర్పాటు చేసినట్లు రామకృష్ణాపూర్‌లో నీటి సరఫరా ఏర్పాట్లపై యాజమాన్యం దృష్టి సారించాలని కోరుతామన్నారు. అవసరమైతే ఓపెన్‌కాస్టు నీటిని శుద్ధి చేసి కార్మిక కాలనీలకు సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు పరిశీలించాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో నాగవెల్లి శ్రీధర్, శ్రీకాంత్, సత్యనారాయణ, మహ్మద్, తాజ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడుసాంబారు వెంకటస్వామి

సాంకేతిక విద్యకు విద్యార్థులు దూరం

- ప్రభుత్వ పాఠశాలల్లో భర్తీకి నోచుకోని ఖాళీలు
- నిరుపయోగంగా కంప్యూటర్లు



సుర్దాపూర్ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు

కెరమెరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఇద్య అటకెక్కింది. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షకుల ఖాళీలు ఉండడంతో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఒక్కో పాఠశాలలో అయిదు నుంచి పది కంప్యూటర్లను కొనుగోలు చేసింది. వాటికి కావాల్సిన సామాగ్రిని అందించి కాని శిక్షకులు లేక పోవడం కొన్ని కంప్యూటర్లు తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, సుర్దాపూర్, ఝరి పాఠశాలల్లో ప్రభుత్వం 2017లో మంజూరు చేసిన కంప్యూటర్లు అంకార ప్రాయంగా మారాయి. దీంతో విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. మండల కేంద్రంలో మంజూరైన ఏడాది మాత్రమే అవి పని చేయగా మిగితా పాఠశాలల్లో మంజూరైన ప్పటి నుంచి నిరుపయోగంగా మారాయి. కంప్యూటర్లను మంజూరు చేసిన అధికారులు శిక్షకులను నియమించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఉపాధ్యాయల్లో కూడా వీటి పట్ల అంతగా అవగాహన లేక పోయింది. కొంత పరిజ్ఞానం ఉన్న టీచర్లతో పనులు చేయిస్తున్నప్పటికీ అది అంతంతే. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లను ఉపయోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

శిక్షకుల కొరత..



ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షకులు లేక కంప్యూటర్ విద్య నిరుపయోగంగా మారింది. కంప్యూటర్లను వినియగంలోకి తెచ్చేలా అధి కారుల దృష్టికి తీసుకెళ్తాం. శిక్షకులు అవస రాన్ని గుర్తించి నియమించేలా చర్యలు తీసుకుంటాం.

- ఆడె ప్రకాష్, ఎంఈవో

ధాన్యం తిని గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

చెన్నూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కపల్లి గ్రామ సమీ పంలోని పంట పొలాల దగ్గర ధాన్యం తిని 40 గొర్రెలు మృతిచెందగా మరో 17 గొర్రెలు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాయి. సుద్దాల గ్రామానికి చెందిన గానవేన పో చయ్య, తుర్కపల్లి గ్రామానికి చెందిన బట్టి శ్రీశైలం, అక్కల పోచయ్యలకు చెందిన గొర్రెలు శనివారం మేతకు వెళ్లి వరిధాన్యం తినడంతో రెండు రోజులుగా మృత్యువాతపడుతున్నాయి. కత్తెరసాల పశువైద్యాదికారి సతీష్‌కు సమాచారం అందించడంతో ఆయన వెళ్లి చికిత్స అందించారు. అయినా లాభం లేకుండా పోయింది. ఆదివారం కూడా 10 గొ ర్రెలు మృతిచెందాయి. పరిస్థితి విషమంగా ఉన్న 17 గొర్రెలకు చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా పశువైద్యాధికారి శంకర్ కత్తెరసాల, ఆస్నాద, భీమారం పశువైద్యాధికారులు శ్రీనివాస్, రాకేష్ శర్మ, సిబ్బందితో కలిసి వెళ్లి మృతిచెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉన్న గొర్రెలకు చికిత్స అందిస్తు న్నారు. పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఈర్ల మల్లికార్జున్ పరిస్థితిని పరిశీలించి బాధితులను పరామర్శించారు. గొర్రెలు చని పోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

కారు బీభత్సం.. యువకుడి మృతి

హాజీపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం రాత్రి కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఆదివారం ఒక యువకుడు మృతి చెందారు. హాజీపూర్‌లోని పంచర్ కొట్టు సమీపంలో లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ఐ-10 కారు రోడ్డుపై నడిచి వెళ్తున్న నూనె రాజశేఖర్(31) అనే వ్యక్తిని ఢీ కొట్టడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. శేఖర్‌ను ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్తున్న క్రమంలో మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాక బుగ్గ గట్టు సమీపంలో కారు చెట్టును ఢీకొని పల్టీలు కొడుతూ 100 మీటర్ల వరకు వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో కారు నుజ్జు నుజ్జయింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

బొగ్గు లారీని అడ్డుకున్న స్థానికులు



కాసిపేటలో బొగ్గు లారీని అడ్డుకుంటున్న స్థానికులు

కాసిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి నుంచి కాసిపేట బొగ్గు గనికి వెళ్లే లారీలు కాసిపేట ఊరిలో నుంచి వెళ్లడాన్ని నిరసిస్తూ స్థానికులు ఆదివారం లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. ప్రజలు మాట్లాడుతూ కొంత కాలంగా సింగరేణి బొగ్గు టిప్పర్లు, అలాగే దేవాపూర్ సిమెంట్ కంపెనీకి చెందిన లారీలు వేగంగా రోడ్లపై నుంచి వెళ్తున్నాయన్నారు. దీంతో కొందరు ప్రమాదాల బారిన పడగా ధుమ్ము దూళి ఇళ్లలోకి చేరి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతోనే లారీలను అడ్డుకున్నామన్నారు. మందమర్రి ఏరియా నుంచి కాసిపేటకు రావాలంటే జాతీయ రహదారి పై ఉన్న టోల్‌గేట్ నుంచే రావాలని, కొందరు టోల్‌గేట్ బారీ నుంచి తప్పించుకునేందుకు కాసిపేట గ్రామంలో నుంచి వస్తున్నారని తెలిపారు. లారీల్లో పరిమితికి మించి లోడును తీసుకువెళ్తుండడంతో కాసిపేట, ముత్యంపల్లి రోడ్లన్నీ కృంగిపోయి గుంతల మయంగా మారిపోయాయన్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న కాసిపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యపరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగు.. లాభాలు బాగు

- ఒక్కసారి పెట్టుబడి.. 30 ఏళ్ల రాబడి..
- పెరుగుతున్న ఆసక్తి



సలుగుపల్లి గ్రామంలో రైతు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్

బెజ్జూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ సాగుతో విసిగిపోయిన రైతులు తక్కువ శ్రమతో దీర్ఘకాలం పాటు ఎక్కుల లాభాలు తెచ్చిపెట్టే పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుత కాలంలో ఏ పంటలు సాగు చేయాలన్నా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రకృతి వైపరిత్యాల కార ణంగా పంట చేతికొచ్చే వరకు అనుమానమే. అదీ దిగుబడి కూడా వస్తుందో రాదో తెలియదు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావో తెలియని పరిస్థితి. దీంతో మండలంలోని ఓ రైతు వినూత్న సాగుకు శ్రీకారం చుట్టాడు. సలుగుపల్లి గ్రామానికి చెందిన కర్ణబిస్వాస్ 30ఏళ్ల క్రితం కోల్‌కతా నుంచి ఇక్కడికి వచ్చి ఆర్‌ఎంపీ వైద్యుడిగా సేవలు అందిస్తున్నాడు. తన ఇంటి శివారులోని పెరట్లో డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రారంభించాడు. ఖాళీ స్థలంలోని మూడు గుంటల్లో సుమారు 200లకు పైగా డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను నాటాడు. రెండేళ్ల క్రితం డ్రాగన్ మొక్కలను కలకత్త నుంచి తెప్పించి సాగు చేపట్టాడు. ఇందుకు సుమారు రూ.60వేల వరకు ఖర్చు చేశాడు. ప్రస్తుతం ఖాత దశలో ఉంది. మొదటిసారి వచ్చిన పంటను అమ్ముకోగా సుమారు రూ.20వేల వరకు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. మరో 30వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపాడు. జూన్‌లో తిరిగి పంట చేతికి రానుండటంతో మరో 50వేల వరకు ఆదాయం వస్తుందని దీంతో పెట్టుబడి ఖర్చులు తిరిగి వస్తాయని ఆయన వివరించారు. రెండేళ్లలోనే పెట్టుబడి చేతికి వస్తుంది. 30ఏళ్ల పాటు దిగుబడి వస్తూనే ఉంటుంది. ఏటా నీరందిస్తూ ఎరువులు, ఒకసారి దుక్కి కలుపు తీయడం వంటి వాటన్నింటికీ కొంత ఖర్చు అవుతుందని, తానుమాత్రం ఎరువులు వాడడం లేదని కేవలం సేంద్రియ ఎరువులు, నీరు అందిస్తూ సాగు చేపడుతున్నట్లు వివరించారు. తన ఇంటి ఆవరణలో రెండేళ్ల క్రితం నాటిన డ్రాగన్ మొక్కలు ప్రస్తుతం కాయలు కాస్తున్నాయి. పండ్లు కావాల్సిన వారు ఇంటికి వచ్చి తీసుకెళ్తారు. ఒక్కో పండుకు రూ. 70నుంచి 100 విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నాడు.

తక్కువ పెట్టుబడితో ఆదాయం..



తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండడంతో ఉద్దేశ్యంతో డ్రాగన్ ఫ్రూట్ పంటను చేపట్టాను. ఈ ప్రాంతంలో ఈ సాగు ఎక్కడా కూడా లేదు.30ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. ఏటా రెండుమార్లు పంట చేతికొస్తుంది. ఆదాయం కూడా ఎక్కువ ఉండడంతో వచ్చే ఏడాది మరిన్ని మొక్కలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు సాగు చేసి లాభం పొందాలి.

- కర్ణ బిస్వాస్, రైతు

నిరుపేద కుటుంబానికి అమృత కలశం అందజేత

దండేపల్లి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ధర్మరావుపేట చెందిన కాసవేణి నర్సమ్మ అనే నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులతో కూడి అమృత కలశాన్ని అందజేశారు. సత్యసాయి భజన మండలి సేవాదళ్ కో ఆర్డినేటర్ పసుపునూటి సాయిరాం నర్సమ్మకు రెండు నెలల సరి పడా నిత్యవసర సరుకుల అమృత కలశం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి సేవాదళ్ జాయింట్ కోఆర్డినేటర్ కుమార స్వామి గౌడ్, సభ్యులు గురువయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు

రామకృష్ణాపూర్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వన భోజన వేడుకలను పురస్కరించుకొని ఆదివారం మంచిర్యాల జిల్లా గోవింద పతి శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించుకున్నారు. ఈకార్యక్రమంలో భాగంగా వ్యవస్థాపకులు శ్రీనివాస్, అధ్యక్షులు బాగ్యలక్ష్మీలు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఉన్నటువంటి శ్రీవారి సేవా సమితి సభ్యులు తెలుగురాష్ట్రాలో ఉన్నటువంటి వేములవాడ, శ్రీశైలం, తిరుమల తిరుపతి దేవస్థానం, కొండగట్టు సేవా కార్యక్రమాలను చేస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ముందుండడం గొప్ప విషయమన్నారు. ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు కార్తీకమాసం పూర్తయిన తరువాత సేవలకు వెళ్లివచ్చిన కమిటీ సభ్యులందరూ వన భోజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గోవిందా పతి సేవా అధ్యక్షులు విజయ్‌కుమార్, సెక్రటరీ సంపత్, రాజేందర్, కుమార్, ప్రసాద్, ప్రభాకర్, శ్రీనివాస్, మోహన్, ప్రసాద్, తదితరులతోపాటు మహిళా సేవా సమితి సభ్యులు పాలొన్నారు.

సరిహద్దులో ముమ్మరంగా వాహనాలు తనిఖీలు



గూడెంలో చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

దండేపల్లి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మంచిర్యాల జగిత్యాల జిల్లాల సరిహద్దులో మండలంలోని గూడెం చెక్‌పోస్ట్ వద్ద ఏఫ్‌యస్‌టి ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు ముమ్మరంగా వాహ నాలను తనిఖీ చేపడుతున్నారు. జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి వాహనాలోని మంచిర్యాల జిల్లా వైపునకు వచ్చే ప్రతి వాహనాన్ని గూడెం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్నారు.

ఏకగ్రీవం.. అప్పుల భారం



- పంచాయతీలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు కరువు
- నిరాశలో మాజీ సర్పంచులు

కాసిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వ ప్రోత్సహకాలు కరువయ్యాయి. సర్పంచుల ఐదేళ్ల పదవీ కాలం ముగిసినా ప్రభుత్వం అందించే ప్రోత్సహకాలు ఇప్పటి వరకు అందకపోవడంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ప్రభుత్వం రూ. 10 లక్షల నగదు ప్రోత్సాహ కాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.15 లక్షలు ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించే దిశగా పనిచే యాలని ప్రోత్సాహకాలు ప్రకటించారు. కానీ ఇవి ఇప్పటి వరకు ఎక్కడ కూడా ఇవ్వకపోవడంతో సర్పంచులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. 2019లో జరిగిన గ్రా మపంచాయతీ ఎన్నికల్లో జిల్లాలోని 13 మండలాల్లో 32 గ్రామపంచాయతీల సర్పంచులు ఏకగ్రీవ మయ్యారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి నిధులు రాకపోవడంతో అ ప్పుల పాలయ్యామని తాజామాజీ సర్పంచులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు.

గత ఎన్నికల్లో 32 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం

2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచిర్యాల జిల్లాలో 32 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. బెల్లంపల్లి మండలంలో లంబాడితండా, బీమిని మండలంలో అక్కలపల్లి, కాసిపేట మండలంలో చిన్నధర్మారం, భీమారం మండలంలో ఎల్కేశ్వరం, కన్నె పల్లి మండలంలో టేకులపల్లి, వీరాపూర్, తాండూర్ మండలంలో రేచిని, నీలయపల్లె, ద్వారకాపూర్, చెన్నూ రు మండలంలో బుద్దారం, లంబడిపల్లె, శంకరం, పౌ క్కూరు, జైపూర్ మండలంలో ఎల్కంటి, కాన్కూర్, పెగ డపల్లి, కోటపల్లి మండలంలో శెట్‌పల్లి, బొప్పారం, ఎ సన్‌వాయి, దాంపూర్, వేలంపల్లి, పారుపెల్లి, దండేపల్లి మండలంలో చెల్కగూడ, కన్నెపల్లి, ముత్యంపేట, తా నిమడుగు, జన్నారం మండలంలో బాదంపల్లి, లోత్‌రై, సింగారయపేట, లక్షెట్టిపేట మండలంలో చందారం, రంగపేట, తిమ్మాపూర్‌లలో సర్పంచులు ఏకగ్రీవంగా ఎ న్నికయ్యారు.

కానీ వీరి ఐదేళ్ల పదవీ కాలం ముగిసినా ప్రోత్సాహకాలు అందక పోవడం బాధాకరం. గ్రామాల్లో సమిష్టి నిర్ణయాలతో స్థానికంగా అభివృద్ధి చెందాలని ప్రజలందరు ఏక గ్రీవంగా సర్పంచును ఎన్నుకున్నారు. కానీ ప్రభుత్వాలు ప్రోత్సహించకపో వడంతో అభివృద్ధి జరగలేదని ఎన్ని కైన సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు.

ఐదేళ్లు గడిచినా ప్రోత్సాహకం లేదు

-భుక్య సునీత, మాజీసర్పంచ్, చిన్న ధర్మారం, కాసిపేట మండలం



ఏకగ్రీవ పంచాయతీలకు రూ. 10 లక్షలు ఇచ్చి ప్రో త్సహిస్తామని అప్పటి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిం చింది. కానీ ఐదేళ్ల పదవీ కాలం ముగిసినా ఒక్క రూ పాయి కూడా రాదు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 15 లక్షలు ఇస్తామని చెప్పారు. కానీ అవి కూడా రాకపో వడంతో చేసిన పనులకు బిల్లులు రాక అప్పుల పాలయ్యాం. సకాలంలో పంచాయతీలకు నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తు న్నాయి. దీంతో చాలా మంది సర్పంచులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గ్రామాలు అభివృద్ధి చెందా లంటే ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుదల చేయాలి.

మద్యం షాపులకు ఎన్నికల కిక్కు...

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల ప్రక్రియ పూర్తికానుండగా, ఆ తరువాత జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజు లపాటు సమ్మక్క-సారలమ్మ జాతర ఉంది. జాతర సమయంలో గ్రామ దేవతలకు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లిస్తారు. అలాగే ఇళ్లలోనూ సమ్మక్క మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఆయా వేడుకల్లోనూ మద్యానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అలాగే ఇప్పటికే వాయిదా పడిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా రెండు, మూడు నెలల్లో నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు మున్సిపాలిటీల పద వీకాలం ముగిసి కూడా దాదాపు ఏడాదిన్నర సమయం కావస్తోంది. మున్సిపాలిటీ ఎన్నికలను కూడా ఈ ఏడాదిలోపే నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటుంది. వరుస ఎన్నికలతోపాటు సమ్మక్క మహా జాతర ఉండటంతో వైన్ షాపుల యజ మానుల పంట పండినట్లేనన్న చర్చ జరుగుతోంది. మొత్తంగా ఈయేడు మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులకు అదృష్టం కలిసి వచ్చినట్లేనన్న చర్చ సాగుతోంది.

మద్యం పట్టివేత..

ఇల్లందకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన సమ్మయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేపట్టారు. రూ.6100 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

లేబర్‌కోడ్‌లపై హైద్రాబాద్‌లో అఖిలపక్ష సమావేశం



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

మందమర్రిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా డిసెంబర్ 14న హైద్రాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ అఖిలపక్ష కార్మికసం ఘాల సమావేశం నిర్వహిస్తున్నామని హెచ్‌ఎంఎస్‌రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. ఆదివారం గోదా వరిఖనిలో అఖిలపక్ష సంఘాల సమావేశంకు ఆ యన హాజరై మాట్లాడారు. ఈ లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాయడం కోసమేనని తెలిపారు. ఈ కోడ్‌ల వల్ల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. సింగరేణిలో ప్రధానంగా లేబర్‌కోడ్‌లు, బొగ్గు బావుల వేలం పాటలను రద్దు చేయాలని, మెడికల్ బోర్డును కొనసాగించాలని తదితర సమస్యలపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఐఎఫ్‌టీయూ, టీఎస్‌యూఎస్, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఎస్‌జీకేఎస్ కార్మిక సంఘాలు కలిసి వచ్చాయన్నారు. మిగితా సంఘాలను కలుపుకుని హక్కుల సాధన కోసం పనిచేస్తామన్నారు. లేబర్‌కోడ్‌లకు ఉపసంహరించుకోకపోతే తీవ్ర ఆందోళనలు చేస్తామన్నారు. మిగితా సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్‌లు కూడా ఆలోచించాలని పేర్కొన్నారు. నాయకులు రాజయ్య, కుమారస్వామి, రమేష్, రవి, శేఖర్, బేగ్, రాజపోశం పాల్గొన్నారు.

ధాన్యం దళారుల పాలు

నేటికీ ప్రారంభం కాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు



లక్ష్మీపూర్‌లో దళారులకు అమ్ముతున్న రైతు

భీమిని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతులు ఓవైపు పంట పొలాలను రక్షించుకోవడానికి మరో వైపు అకాల వర్షాలు నుంచి కాపాడుకోవడానికి నానా తంటాలుపడ్డారు. వరి కోతలు మండలంలో ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వం మండలంలో ఎక్కడా కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో దళారులను ఆశ్రయించి తకువ ధరకే అమ్ముకుంటున్నారు. క్వింటాల్‌కు రూ. 2100 అమ్ముకొని నష్టపోతున్నరు. వాతావరణం చల్లబడుతోంది, ఎప్పుడు వర్షం పడుతుందనే భయం రైతులను వెంటాడుతోంది. మండలంలో ఇంత వరకు కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలు పొంచి ఉండటంతో ధాన్యాన్ని దళారులకు విక్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఉప సర్పంచును ఎన్నుకోవడం ఇలా..

భీమిని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో గ్రామ సర్పంచు ప్రథమ పౌరుడు. పాలకవర్గంలో ఆ తర్వాత స్థానం ఉప సర్పంచుకే దక్కుతుంది. ఉప సర్పంచును ఎన్నుకోడానికి వార్డు సభ్యులు, ఎన్నికైన గ్రామ సర్పంచు సమావేశం అవుతారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తరువాత సర్పంచు, వార్డు సభ్యుల ఫలితాలు ప్రకటిస్తారు. ఉప సర్పంచు కోసం కొంత సమయాన్ని ఇస్తారు. ఎన్నికైన వార్డ సభయల్లోనే ఒకరిని ఉ ప సర్పంచుగా అభ్యర్థిగా ప్రకటించి వార్డు సభ్యుల్లో ఒకరు బలపరుస్తారు. వార్డు సభ్యులకు ఏకాభిప్రాయం కాని సందర్భంలో ఎన్నికకు ప్రతిపాదిత వార్డు సభ్యుల మధ్య ఓటింగ్ నిర్వహించి ఉప సర్పంచును ఎన్నుకుంటారు. వార్డు సభ్యులు చేతిని ఎత్తడం ద్వారా ఉప సర్పంచు ఎన్నిక ప్రక్రియ జరుగుతుంది. మెజారిటీ పొందిన వార్డు సభ్యుడుని రిటర్నింగ్ అధికారి ఉప సర్పంచుగా వెల్లడిస్తారు. ఉప సర్పంచు ఎన్నిక సందర్భంగా కోరం లేకపోతే ఎన్నికను మరుసరి రోజుకు వాయిదావేసి తిరిగి నిర్వహిస్తారు. ఒక వేళ పోటీ పడిన ఇరువురికీ సమానమైన ఓట్లు దక్కితే వార్డు సభ్యుల సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి టాస్‌వేసి ఉప సర్పంచును ఎన్నుకుంటారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి



శెట్‌పల్లిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జైపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంగిపల్లి, శెట్‌పల్లి, కుందారం, నర్సింగాపూర్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, రైతులకు నష్టం కలుగకుండా, సెంటర్ కూడా నష్టపోకుండా ఉండే విధంగా వాతావరణం, తేమ శాతంను బట్టి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, సీసీలు ఉన్నారు.

రెండు నామినేషన్లు తిరస్కరణ..

లక్షెట్టిపేట, నవంబరు, 30(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల సందర్భంగా లక్షెట్టిపేట మండలంలోని 18 గ్రామాల నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా 104 మంది, వార్డు సభ్యులకు 385మంది సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల గడువు ముగియడంతో ఆదివారం వచ్చిన నామినేషన్లను అధికారులు పరిశీలించగా సర్పంచ్ నుంచి ఒకటి వార్డు సభ్యుల నామినేషన్ల నుంచి ఒకటి రిజెక్టు కాగా ప్రస్తుతం సర్పంచ్ అభ్యర్థులుగా 103, వార్డు సభ్యులుగా 384 మంది నామినేషన్లను అధికారులు ఓకే చెప్పారు. ఉప సంహరణల కోసం రెండు రోజుల గడువు ఉందని ఆతర్వాత బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని అధికారులు వెల్లడించారు.

దండేపల్లి: మొదటి విడత సర్పంచ్, వార్డుల సభ్యుల ఎన్నికల సందర్భంగా దండేపల్లి మండలం శనివారంతో నామినేషన్ ప్రక్రియ ముగిసింది. దీంతో మండలంలోని 31 పంచాయతీలకు గాను 28 పంచాయతీలో సర్పంచుల పదవి కోసం 171 మంది, 576 మంది వార్డు సభ్యుల కోసం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ప్రక్రియ శనివారం అర్ధరాత్రి కొనసాగింది. మండల స్థాయి అధికారులు నామినేషన్ ప్రక్రియను రాత్రి వరకు పర్యవేక్షించారు.

సర్దార్ అడుగుజాడల్లో నడవాలి..

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి



యూనిటీ మార్చ్‌లో పాల్గొన్న బీజేవైఎం నాయకులు

హాజీపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి యూనిటీ మార్చ్ ఈనెల 23న ప్రారంభమై ఆదివారంతో ము గిశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మార్ల ప్రదీప్‌లు హాజరై మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతోనే స్వాతంత్రం వచ్చిందని అన్నారు. తెలంగాణ ప్రజల మానప్రాణాలు, సంస్కృతిని కాపాడిన గొప్ప వ్యక్తి సర్దార్ పటేల్ అని అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణకు చేసిన సేవలు నేటి యువతరం గుర్తు చేసుకోవాలని తెలిపారు.

దారి దోపిడీకి పాల్పడిన దొంగల అరెస్టు

జగిత్యాల టౌన్, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి డీసీఎం డ్రైవర్ అతని వద్ద నుంచి రూ, 22వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన దొంగల ముఠాను అరెస్టు చే సినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆదివారం ఆయన వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటపూర్‌కు చెందిన తాళ్లపల్లి నవీన్ తన సొంత డీసీఎం వ్యాన్‌వద్ద లోడ్‌ను నిజా మాబాద్‌కు తీసుకెళ్ళాడు. అక్కడ వడ్లలోడ్‌ను దింపి మంచిర్యాలకు వస్తు న్న క్రమంలో శనివారం రాత్రి జగిత్యాల నిజామాబాద్ జాతీయ రహదారిపై వద్ద అర్ధరాత్రి మోటర్ బైక్‌పై వచ్చిన జగిత్యాలకు చెందిన ఎర్రం సాయి, నక్క గణేష్‌తో పాటు మరో నిందితుడు నవీన్‌పై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ, 22 వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. నవీన్ ఫిర్యాదు మేరకు జగిత్యాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం నిందితులను పట్టుకుని సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

నామినేషన్ కేంద్రాలు తనిఖీ చేసిన డీసీపీ



భీమిని మండలం వీగాంలో ప్రజలతో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

భీమిని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను డీసీపీ భాస్కర్ ఆదివారం తనిఖీ చేశారు. వీగాంలోని ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియామళిని అందరూ పాటించేలా చూడాలన్నారు. సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తాండూరు సీఐ దేవయ్య ఉన్నారు.

తాండూర్ : మండలంలోని అచ్చులాపూర్ గ్రామంలో ఆదివారం పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను డివిజనల్‌పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్‌కుమార్ పరిశీలించారు. నామినేషన్‌ల స్వీకరణను పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని రిటర్నింగ్ అధికారికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

కాసిపేట : మండలంలో ఆదివారం నుంచి నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా ఎన్నికల పరిశీలకులు మనోహర్ కాసిపేట, ముత్యంపల్లిలోని నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. హెల్ప్ డెస్క్ ద్వారా సరైన సూచనలు, వివరాలను తెలియజేయాలన్నారు.

నామినేషన్‌ల ప్రక్రియ శాంతియుతంగా నిర్వహించేందుకు అందరి సహకారం తీసుకుని సులభతరంగా ముగించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్‌సప్దర్ ఆలీ, సిబ్బంది ఉన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామ పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఆదివారం బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్‌కుమార్ పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీవో వెంకటేశ్, ఆర్ఐ ఖలిక్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నెన్నెల : నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అధికారులకు సూచించారు. రెండో దశ నామినేషన్ల ప్రక్రియను ఆదివారం నందులపల్లిలో పరిశీలించారు. కేంద్రాల్లోకి ముగ్గురి కంటే ఎక్కువ మందిని అనుమతించవద్దని పేర్కొన్నారు. పొరపాట్లకు తావు లేకుండా క్రమ పద్ధతిలో పత్రాలను స్వీకరించాలన్నారు. అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమాచారాన్ని ఎప్పటి కప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

టీఎన్జీవో కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో నాయకులు

మంచిర్యాల క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా టిఎన్జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరి అధ్యక్షతన ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి శ్రీహరి మాట్లాడుతూ డిసెంబరులో జిల్లాలోని 6 యూనిట్లు సభ్యత్వ నమోదును 100 శాతం పూర్తి చేయాలని, నూతన సంవత్సరం పురస్కరించుకొని క్యాలెండర్ డైరీ ఆవిష్కరణకు ప్రతి యూనిట్ నుంచి సహాయ సహకారాలు అందించి నూతన సంవత్సరంలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణను ఘనంగా నిర్వహించాలని అన్నారు.

ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజియా రాణి, రాంకుమార్, తిరుపతి, అంజయ్యా, శ్రీధరాజు, శివప్రసాద్ సంయుక్త కార్యదర్శి సునీత, ప్రభు ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్ కుమార్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్ ప్రశాంత్, మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, ప్రచార కార్యదర్శి యూసఫ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవం దిశగా ధర్మారావుపేట పంచాయతీ

కాసిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ధర్మారావుపేట గ్రామపంచాయతీని ఏకగ్రీవంగా చేసేందుకు అధి కార పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు స్వగ్రామం కావడంతో ఇక్కడ ఎన్ని కలు ఉత్కంఠగా మారింది. కానీ పార్టీలకు అతీతంగా సర్పంచును ఏకగ్రీవం చేసి గ్రామాభివృద్ధికి పాటు పడాలని గ్రామ పెద్దలందరు సమిష్టిగా నిర్ణయం తీసుకుని పోటీ లేకుండా సర్పంచును ఏకగ్రీవం చేద్దామని తీర్మాణించుకున్నారు. గడిచిన ఎన్నికల్లో ఇక్కడ ఎస్టీ ఓటరు ఎవరు లేకపోవడంతో ఎన్నికలు నిర్వహించలేదు. ఇటీవల ధర్మారావుపేటకు చెందిన ముగ్గురు యువకులు గిరిజన యువతులను ప్రేమ వివాహం చేసుకున్నారు. దీంతో ఇక్కడ ఎన్నికలు అనివార్యమయ్యాయి. గ్రామ పెద్దలు ముగ్గురు అమ్మాయిల నుంచి సమర్థవంతురాలైన అమ్మాయిని ఎంపిక చేసి సర్పంచుగా చేసేందుకు సభ్యులందరు ఏకగ్రీవ తీర్మాణం చేసుకున్నారు.

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి

మంథనిరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరెంద వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఆదివారం పంచిక సదయ్య(40) అనే వ్యక్తి మృతి చెందాడు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సదయ్యకు మల్లన్న బోనాలు ఉండటంతో గోదావరి నది స్నానానికి వెళ్లాడు అయితే స్నానం చేసిన అనంతరం ఇసుక కోసం తిరిగి గోదావరి నదిలోకి వెళ్లగా నీటిలో మునిగిపోయాడు. బంధువులు అతని రక్షించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గోదావరి నదిలో గల్లంతయిన సదయ్య కోసం సుమారు రెండు గంటల పాటు గాలించిన అనంతరం మృతదేహన్ని గ్రామస్థులు వెలి కితీశారు.

లభ్యంకాని మృతుడి ఆచూకీ

జమ్మికుంట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శంభునపల్లి శివారులో లభించిన గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఆచూకి తెలియరాలేదు. క్లూస్ టీం మృతుడి శరీర బాగాల నుంచి శాంపిల్స్ సేకరించింది. డాగ్ స్క్వాడ్ మృతదేహం పడి ఉన్న ప్రాంతం మొత్తం తిరిగినా ఫలితం లేదు.



విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఎంచుకున్న లక్ష్యాలను సులభంగా సాధిస్తారని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డు కులముల బాలికల కళాశాల, సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక సదుపాయాలను కల్పిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు దుర్గా ప్రసాద్, సహాయ అధికారి ధర్మానంద్‌గౌడ్, వసతి గృహ సంక్షేమ అధికారిణి చందన పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

దండేపల్లి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు డిసెంబర్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలని దండేపల్లి ఉన్నత పాఠశాల సమన్వయకర్త సంగర్స్ రాజేశ్వర్ రావు ఆదివారం ఓప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యాసకులు పది, ఇంటర్ ప్రవేశాల పొందేందుకు ఇది చివరి అవకాశం అన్నారు. అభ్యాసకులు నిజ ధృవీకరణ పత్రాలతో సంప్రదించాలని, ఈ ప్రవేశ రుసుముతో మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాలతో చెల్లించి రెండు జతల ధృవీకరణ పత్రాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని అందించాలన్నారు. వివరాలకు 8309769067 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మద్యం షాపులకు ఎన్నికల కిక్కు



- నేటి నుంచి కొత్త పాలసీ ప్రారంభం
- పంచాయతీ ఎన్నికలతో వ్యాపారుల్లో జోష్
- యజమానులకు కలిసి వచ్చిన అదృష్టం

మంచిర్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం షాపులకు పంచాయతీ ఎన్నికలు నూతన కిక్కును ఇవ్వనున్నాయి. 2025-2027 సంవత్సరానికి గాను ప్రభుత్వం ఇటీవలే టెండర్లు నిర్వహించింది. గత అక్టోబరు 27న జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, లక్షెట్టిపేట ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 73 షాపులకు లక్కీ డ్రా ద్వారా నిర్వహించి, లబ్దిదారులను ఎంపిక చేశారు. పాత మద్యం పాలసీ సెప్టెంబరు 30తో ముగుస్తుండగా, ఈ నెల 1వ తేదీ నుంచి కొత్త షాపులను ప్రారంభించేందుకు యజమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించడంతో వైన్ షాపుల యజమానుల ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. ఎన్నికల పుణ్యమా అని వైన్ ప్రారంభంలోనే బోణీ అదిరిపోతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదే మద్యం పాలసీలో అంటే మరో ఏడాది కాలంలో మున్సిపాలిటీ, పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటం, సమ్మక్క-సారలమ్మ జాతర కూడా జనవరిలో ఉన్నందున ఈ సారి మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిని అదృష్టం వరించినట్లేనన్న ప్రచారం కూడా జరుగుతోంది. కొత్త మద్యం షాపుల టెండరు ఫీజు పెరిగినందున కొందరు వ్యాపారులు ఈసారి షాపులకు దూరంగా ఉన్నారు. వారందరికీ ఎన్నికల రూపంలో ఆశనిపాశమే ఎదురవుతుందనే వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి.

భారీగా స్టాకు దింపే యోచనలో...

కొత్త మద్యం షాపులకు డిసెంబరు 1వ తేదీ నుంచి విక్రయాలు జరిపేందుకు ఇప్పటికే ఎక్సైజ్‌శాఖ అనుమతులు మంజూరు చేసింది. ఆదివారంతో పాత లైసెన్సు గడువు ముగుస్తుండటంతో మరునాడు నుంచే కొత్త షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. మరోవైపు ఇప్పటికే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో షాపుల నిర్వాహకులు భారీగా స్టాకును దింపే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నవంబరు 27వ తేదీ నుంచి ఈ నెల 17వ తేదీ వరకు మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. తొలి విడుత ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ కూడా ముగియగా, డిసెంబరు 1వ తేదీ నుంచి అభ్యర్థులంతా ప్రచారం ఊదరగొట్టనున్నారు. అలాగే రెండో విడుత ఎన్నికల నామినేషన్లు సైతం ఆదివారం నుంచి ప్రారంభం కాగా, ఈ నెల 2వ తేదీతో ముగియనున్నాయి. రెండో విడుతలో 4వ తేదీ నుంచే అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లనున్నారు. ఇక మూడో విడుత నామినేషన్లు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కాగా, 6వ తేదీ నుంచి అభ్యర్థులు ప్రచారబాట పట్టనున్నారు. మూడు విడతల ఎన్నికలు ఈ నెల 11, 14, 17 తేదీల్లో జరుగనున్నాయి. అంటే కొత్త వైన్ షాపులు ప్రారంభమైన నాటి నుంచి తొలి పక్షం రోజులు మద్యం విక్రయాల్లో జోష్ నిండనుంది.

యజమానులకు కాసుల వర్షం...

కొత్త మద్యం షాపు యజమానులకు ఈ మద్యం పాలసీలో కాసుల వర్షం కురియనుంది. ఈ నెల 17వ తేదీ వరకు పంచాయతీ..

(తరువాయి 7లో)

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక



ప్రాజెక్టుతో గైడ్ టీచర్ ఓడిగె కృష్ణ, విద్యార్థి అశ్విత్ వర్మ

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నస్పూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్‌ఫేర్‌లో జిల్లా కేంద్రంలోని చెన్నూర్ రోడ్ సాయికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మేడం అశ్విత్ వర్మ, గైడ్ టీచర్ ఓడిగె కృష్ణలు తయారు చేసిన ఆటో మేటిక్ అప్పర్ డిప్పర్ సిస్టం ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ ఆటో మేటిక్ అప్పర్ డిప్పర్ సిస్టం కిట్‌ను వాహనానికి అమరిస్తే ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురు వాహనం మీద పడగానే హెడ్ లైట్లు వాటంతట అవే ఆరి పోయి డిప్పర్ లైట్లు వెలుగుతాయి. వాహనం వెళ్లిపోగానే తిరిగి హెడ్‌లైట్లు వాటంతట అవే డ్రైవర్ ప్రమేయం లేకుండా వెలిగేలా ఈ ప్రాజెక్టును గైడ్ టీచర్ ఓడిగె కృష్ణ, విద్యార్థి అశ్విత్ వర్మలు రూపొందించారు. ప్రతి వాహనంలో ఈ కిట్‌ను అమర్చుకుంటే రాత్రిపూట ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. జిల్లా స్థాయిలో ప్రాజెక్టు ప్రతిభ కనబర్చడంతో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఈవో యాదయ్యలు అవార్డు అందజేశారు. త్వరలో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో వీరు పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థి అశ్విత్ వర్మ, గైడ్ టీచర్ కృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నౌషిన్ ఫాతిమా, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వరలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు.

సైన్స్‌ఫెయిర్‌లో రాణించిన కేజీబీవీ విద్యార్థి

భీమారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి 53వ వైజ్ఞానిక ప్రదర్శనలో భీమారంలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సుంకరి అనూష ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అనూష చేసిన క్రియేటివ్ హోమ్ డెక్కర్స్ ప్రాజెక్టు అధికారులను ఆకట్టుకోగా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. విద్యార్థిని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మీ , ఉపాధ్యాయులు అభినందించారు.

వార్డులన్నీ ఏకగ్రీవం..సర్పంచ్‌కు మాత్రమే పోటీ

హాజీపూర్, నవంబరు 30(ఆంధజ్యోతి) : మండలంలోని కర్ణమామిడి గ్రా మపంచాయతీలో ఉన్న 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. సర్పంచ్‌కు మాత్రం మూడు ప్రధాన పార్టీలు బలపర్చిన అభ్యర్థులు పోటీలో ఉండనున్నారు. జిల్లాలోనే అతి సున్నితమైన పంచాయతీగా పోలీస్‌శాఖ నిఘాలో వుంటుంది. ఎన్నికలంటే గొడవలకు పెట్టింది పేరైన అలాంటి పంచాయతీలో 2470 మంది ఓటర్లు 10 వార్డులు ఉన్నాయి. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో బాగంగా బుధ, గురు, శని వారాల్లో నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. కానీ 10 వార్డుల్లో కేవలం ఒక్కో వార్డుకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో 10 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.

ఆలస్యం వారికి అమృతం అవుతోంది...

కోటపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆలస్యం అమృతం విషం అనే నానుడి ఉంది. కానీ ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయక నిషేధం బారిన పడిన అప్పటి అభ్యర్థులు ఇప్పుడు పోటీకి అర్హత సాధించారు. వారిపై ఎన్నికల సంఘం విధించిన మూడేళ్ల సమయం ముగిసింది. పంచాయతీరాజ్ 2018 చట్టం ప్రకారం 2019 జనవరిలో పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. నిబంధనల ప్రకారం అభ్యర్థులు ఓడినా, గెలిచినా 45 రోజుల్లో ఎన్నికల సంఘానికి లెక్కలు సమర్పించాలి. ఓడిపోయామని కొందరు, అవగాహన లేక మరికొందరు లెక్కలు చూపలేదు. దీంతో నాడు జిల్లాలో వందల మందిపై ఎన్నికల్లో పోటీ చేయకుండా 2021లో నిషేధం పడింది. 2024 జులైతో వారి నిషేధ కాలం ముగిసింది. ఒక వేళ ఎన్నికలు ఆ గడువులోగా నిర్ణయించి ఉంటే వారికి పోటీ చేసే అవకాశం ఉండేది కాదు. కానీ ఎన్నికలు ఆలస్యం కావడంతో వారికి అది అమృతంగా మారి మళ్లీ పోటీ చేసే అవకాశం దక్కింది.

మీకు తెలుసా.. జీపీలు ఏర్పాటు అయ్యింది ఇలా..

కోటపల్లి/వాంకిడి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీలు ఏర్పాటు అయ్యింది ఎలానో తెలుసుకోవాలని ఉందా.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తొలి ప్రధాని నెహ్రూ నాయకత్వంలో ప్రజాస్వామ్యం, స్వామ్య వాదం నినాదంతో పాలన సాగించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో పాటు గ్రామీ ణుల జీవన ప్రమాణాలను మెరుగు పర్చాలనే సంకల్పంతో 1952లో మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించారు. ప్రొఫెసర్ ఎస్‌కే డే నేతృత్వంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని అమలుపర్చారు. దీనిపై శాస్త్రీయ అధ్యయనానికి సామాజిక ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ బల్వంత్ రాయ్‌మెహతా నేతృత్వంలో అధ్యయనం బృందాన్ని నియమించారు. వారి అధ్యయనం ప్రకారం ప్రజల భాగస్వామ్యం కోసం మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, ప్రణాళిక వికేంద్రీకరణ ద్వారా ప్రజల అవసరాలకు అను గుణంగా వనరులను వినియోగించుకోవడం, శాశ్వతమైన పరిపాలన అమలు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నివేదికలు ప్రభుత్వానికి సమర్పించారు. దీని ఆధారంగా మహాత్మాగాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా భారత ప్రభుత్వం 1959లో జిల్లా, బ్లాక్, గ్రామపంచా యత్ అనే మూడంచెల పంచాయతీరాజ్ వ్య వస్థను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థను దేశంలో మొట్టమొదట రాజస్థాన్‌లో అక్టోబర్ 2న, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో 1959 అక్టోబర్ 11న అప్పటి ప్రధాని నెహ్రూ ప్రారంభించారు. ఈ వ్యవస్థ దశల వారీగా దేశమంతటా అమలు కావడంతో నేటి గ్రామపంచాయతీలు ఇలా ఏర్పడ్డాయి.

సర్పంచుకు జీతమెంత ?

నెన్నెల/బెజ్జూరు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌గా పోటీ చేసేందుకు చాలా మంది సై అంటున్నారు. పదవి కోసం ఎంతైన ఖర్చు చేసేందుకు కాలుదు వ్వుతున్నారు. ఒక్కో చోట సర్పంచ్ పదవి లక్షలు పలుకుతోంది. ఇంత డిమాండ్ ఉన్న సర్పంచ్‌కు గౌరవ వేతనం ఎంతో తెలుసా..? రూ.6500లే. అది కూడా ఏడాదికి ఒకటి రెండు సార్లు మాత్రమే వస్తాయి. ఇంత తక్కువ జీతంతో వచ్చే పదవి కోసం అంత ఆరాటం అవసరమా అనే ప్రశ్న చాలామందిలో తలెత్తు తోంది. కానీ వేతనం కోసం కాకుండా దక్కే హోదా కోసమే నేతలు ఆరటపడ తారు. ఎన్నికైతే గ్రామానికి ప్రథమ పౌరుడిగా గౌరవం దక్కుతుంది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం ఉంటుంది. ఎక్కడికి వెళ్లినా సర్పంచ్ సాబ్.. అనే తియ్యటి పిలుపు వినిపిస్తుంది. అధికారికంగా ప్రజ లకు సేవ చేసే భాగ్యం దక్కుతుంది.

సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు పరిశీలన

దండేపల్లి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా దండేపల్లి మండలంలోని 28 పంచాయతీలో 171 మంది సర్పంచులకు, 576 మంది వార్డు సభ్యుల కోసం నామినేషన్లు వేశారు. శనివారంతో నామినేషన్ల ఘట్టం ముగియడంతో వాటిని ఆదివారం ఎన్నికల అధికారులు, సిబ్బంది నామినేషను పరిశీలన చేశారు. కాగా కొన్ని చోట్ల నామినేషన్ల తిరస్కరణకు గురయ్యాయి. పరిశీలన అనంతరం నివేదికను రిటర్నింగ్ అధికారులు దండేపల్లి మండల పరిషత్ కార్యలయంలో అందజేశారు.

ఓటేయాలంటే..మైళ్లు నడవాల్సిందే

నేటికీ ఊట్ల గిరిజనులకు తప్పని కష్టాలు

దండేపల్లి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ల గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారినా నేటికి గిరిజనుల తలరాతలు మారడం లేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటూ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న తమపై ఎవరూ కనికరం చూపడం లేదని దండేపల్లి మండలం పాత మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఊట్ల గిరిజనులు వాపోతున్నారు. కనీసం రహదారంతా కంకార తేలి అధ్వానంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ఏవైనా ఓటు హక్కు వినియోగిం చుకోవాలంటే వారంతా 7కిలో మీటర్ల దూర ప్రాంతానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలి. గ్రామంలో సుమారు 110 మంది జనాభా ఉన్నారు. అందులో 50 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించు కోవాలని ఒకవైపు ప్రభుత్వం, అధికారులు విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కానీ ఊట్ల ఆదివాసి గిరిజనులు ప్రతి ఎన్నికలకు ఊట్ల నుంచి మామిడిపల్లి ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు కాలినడక, బైక్, సైకిల్‌పై వెళ్లి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం అధికారులైనా స్పందించి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏదైనా ప్రభుత్వ వాహనం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



గూడెం గ్రామ ముఖచిత్రం

రెండో విడత తొలిరోజు 75 నామినేషన్లు

- సర్పంచ్ స్థానాలకు 45
- వార్డు సభ్యులకు 30 దాఖలు

మంచిర్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడుత నామినేషన్ల పర్వం ఆదివారం ప్రారంభమైంది. రెండో విడుతలో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూరు, వేమనపల్లి మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా మండలాల్లోని మొత్తం 114 గ్రామ పంచాయ తీలు, 996 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి రోజు ఆయా మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 45, వార్డు మెంబర్ స్థానాలకు 30 నామినేషన్లు దాఖలయ్యాయి.

మొదటి విడుతలో భారీగా..

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడుత నామినేషన్ల స్వీకరణ ఈ నెల 27వ తేదీన ప్రారంభం కాగా, 29వ తేదీతో ముగిశాయి. మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో మొత్తం 90 సర్పంచ్ స్థానా లకు, 816 వార్డు సభ్యుల స్థానాలకు భారీ మొత్తంలో నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజైన ఈ నెల 29వ తేదీన ఊహించని విధంగా అభ్యర్థుల నుంచి స్పందన లభించింది. నాలుగు మండలాల్లోని సర్పంచ్ స్థానాలు 90కిగాను మొత్తం 518 నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే వార్డు సభ్యుల స్థానాలు 816కు గాను గడువు ముగిసే నాటికి మొత్తంగా 1749 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారు.

బెల్లంపల్లిలో మొదటిరోజు..

బెల్లంపల్లి: సర్పంచ్, వార్డుమెంబర్లకు ఆదివారం బెల్లంపల్లిలో మొదటి రోజు నామినేషన్లు వేసేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు ఆసక్తిచూపలేదు. మొదటి రోజు సర్పంచ్ స్థానానికి 11 వార్డు మెంబర్ స్థానాలకు 6 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో మహేందర్ తెలిపారు. మండలంలోని ఆకనపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి 5, బుచ్చయ్యపల్లి 1, బట్వాన్‌పల్లి-1, కన్నాల 2, అంకూసం 1, దుగ్నెపల్లి 1 మొత్తం సర్పంచ్ స్థానాలకు దాఖలయ్యాయి. వార్డు మెంబర్ స్థానాలకు ఆకనపల్లి నుంచి 1, బుచ్చయ్య పల్లి నుంచి 1, పెరికపల్లి నుంచి 2, సోమగూడెం నుంచి 2, మొత్తం 6 నామినేషన్లు దాఖలయ్యాయి. సబ్‌కలెక్టర్ మనోజ్ గురిజాల నామినేషన్ కేంద్రాన్ని పరిశీ లించారు. ఆయన వెంట తహసీల్దార్ క్రిష్ణ, ఎంపీవో శ్రీనివాస్‌లు ఉన్నారు.

తాండూర్ : మండలంలో సర్పంచు కోసం తాండూర్‌లో 1, కొత్తపల్లిలో 1, మాదారంలో 1, నీలాయపల్లిలో 2, కిష్టంపేటలో 1, బోయపల్లిలో 1, రాజీవ్‌నగర్‌లో 1 నామినేషన్‌లు దాఖలయ్యాయి. అలాగే వార్డు సభ్యులకు తాండూర్‌లో 3, నర్సాపూర్‌లో 5, బోయపల్లిలో 2 నామినేషన్ దాఖలైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

నెన్నెల : మండలంలో 19 జీపీలకు గాను ఏడు క్లస్టర్లు ఏర్పాటు చేసి నామినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజైన ఆదివారం సర్పంచులకు 5, వార్డు సభ్యులకు మూడు నామినేషన్లు దాఖలయ్యా యి. గుండ్లసోమారంలో సర్పంచ్‌కు ఒకటి, వార్డులకు మూడు, నెన్నెలలో సర్పంచుకు ఒకటి, కొత్తూరులో సర్పంచుకు ఒకటి, చిన్నవెంకటాపూర్‌లో స ర్పంచుకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంపీడీవో మహమ్మద్ అ బ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొదటి రోజు మందకొడిగా నామినేషన్‌లు

కాసిపేట: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలో మొదటి రోజు నామినేషన్‌లు మందకొడిగా మొదలయ్యాయి. 22 గ్రామపంచాయతీలకు 7 నామినేషన్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ముత్యంపల్లి, కోమటిచేను, ధర్మారావుపేట, సోనాపూర్ నామినేషన్ కేంద్రాల్లో ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. అలాగే కోనూరు నామినేషన్ కేంద్రంలో కోనూరు సర్పంచు అభ్యర్థిగా పేరం మల్లేష్, 1 వార్డు సభ్యుడు, కొండాపూర్ సర్పంచు అభ్యర్థిగా ఉత్తూరి వాసవి నామినేషన్‌లు దాఖలు చేశారు. కాసిపేటలో 2 వార్డు సభ్యులకు నామ పత్రాలు సమర్పించగా, దేవాపూర్ నామినేషన్ కేంద్రంలో 1 సర్పంచు అభ్యర్థి, ఇద్దరు వార్డు సభ్యులు నామినేషన్ పత్రాలను సమర్పించారు.



బెల్లంపల్లిలోని గురిజాల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్, తహసీల్దార్

భీమిని : మండలంలో 12 గ్రామ పంచాయతీలకు గాను ముడు క్లస్టర్లుగా విభజించి మూడు సెంటర్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. వెంకటాపూర్‌లో సర్పంచుకు, వార్డు మెంబర్‌కు ఒక్కొక్కటి, వీగాంలో సర్పంచ్‌కు ఒకటి, వార్డు మెంబర్లకు రెండు, భీమిని, చిన్న తిమ్మాపూర్‌లో సర్పంచ్‌కు ఒక్కటి చొప్పున నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని బెల్లంపల్లి డీఎల్‌పీవో కొమ్మెర సతీష్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగా మోహన్, తహసీల్దార్ బికర్ణదాస్, ఎస్సై విజయ్‌కుమార్ ఉన్నారు.

వేమనపల్లి: మండలంలోని 14 గ్రామ పంచాయతీలకుగాను మూడు చోట్ల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం అధికారులు ప్రారంభించారు. ఇందులో 14 సర్పంచ్ స్థానాలకు 8 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. 118 వార్డులకు గాను ఒక్క వార్డు స్థానానికి నామినేషన్ దాఖలైనట్లు ఎంపీడీవో కుమారస్వామి తెలిపారు.

ఘనంగా మంత్రి వివేక్ జన్మదిన వేడుకలు

మందమర్రిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఆ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు మున్సి పల్ కమిషనర్ రాజలింగు చేతుల మీదుగా చలికోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అనుమాండ్ల మధు, రాకం సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

- పట్టణంలోని 6వ వార్డు నార్లపూర్‌లో పేదలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం, దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు ప్రజలతో కలిసి ఆయన కేక్‌కట్ చేస్తూ కార్యకర్తలకు తినిపించారు. నాయకులు రాగిడి రామిరెడ్డి పాల్గొన్నారు.
- మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేయించారు.
- స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి జన్మదిన కేకును పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు, దాని అనుబంధ సంఘాల నాయకులు సుదర్శన్, తిరుమల్, లక్ష్మణ్, ఎండీ ఇసాక్, జావేద్‌ఖాన్, రజని, రాయబారపు కిరణ్, నర్సోజీ, శంకర్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: మంత్రి వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ వేడుకలు జరుపుకు న్నారు. డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కాకా కుటుంబ సభ్యుల సేవలు మరువేని వన్నారు. పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కాంగ్రెస్ నాయకులు రాజయ్య, జిల్లా అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, పాల్గొన్నారు. మంజునాథహిల్స్ 9వ వార్డు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపతి భానేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు రక్తాన్ని అందించారు.

మందమర్రిరూరల్ : వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం మంత్రి వివేక్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి చిన్నయ్య కేక్ కట్ చేశారు. సూరమ్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





మందమర్రిలో స్వట్టర్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, కళాకారుల సమాఖ్య నాయకులు.. రామకృష్ణాపూర్‌లో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మావోయిస్టులపై కేంద్రం పునరాలోచించాలి

సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు కలవేన శంకర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చల ద్వారా పరిష్కార మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా బూటకపు ఎన్‌కౌంటర్ తర్వాత దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు నిరసన తెలిపారన్నారు. మెజార్టీ ప్రజల ఆలోచనలను కేంద్రం గౌరవించాలన్నారు. అలాగే డిసెంబరు 26న రామకృష్ణపూర్‌లో సీపీఐ వంద సంవత్సరాల శత జయంతి ముగింపు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. జిల్లాలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఐ సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థులను ప్రజలందరు గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, చంద్రకళ, మల్లయ్య, లింగయ్య, నగేష్, శ్రీనివాస్, దుర్గరాజ్, రాజమొగిలి, బానేష్, పోచన్న పాల్గొన్నారు.